సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 8 । జూన్ । 2023



## హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. రూ.5,22,481, 2.280 గ్రా. బంగారం, 420 గ్రా. వెండి లభించింది.



## వైభవంగా రథ సంప్రోక్షణ

నిడమర్రు: చానమిల్లిలో కేశవస్వామి, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల రథ సంప్రోక్షణ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పాకలపాటి గోపాలకృష్ణ (సూర్యచంద్రరావుపేట) రూ.1,01,116, పర్వతనేని వసంతదేవి (పునాదిపాడు) రూ.1,00,116ను అందజేశారు.

# ఆనందమానందమాయెనే

### ఏళ్ల నాటి కల.. సాకారమైన వేళ

- మంత్రివర్గ నిర్ణయాలపై అంతటా సంతోషం
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఉద్యోగులందరికీ మేలు
- కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణపై హర్షం



ఏలూరులో కలెక్టరేట్ ముఖద్వారం

**ఏలూరు(మెట్రో):** ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఏళ్ల నాటి కలను సాకారం చేసేలా బుధవారం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. శాశ్వత ఉద్యోగులకు లబ్ధి చేకూర్చడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామనడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**కాంట్రాక్ట్ ఉద్యోగులు 980 మంది..**

జిల్లావ్యాప్తంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, విద్య, వైద్య ఇలా ప్రతి శాఖలో ఉన్నారు. వీరంతా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని గత ప్రభుత్వాలకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల ముందు జగనన్న ఇచ్చిన హామీ మేరకు 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తిచేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీంతో జిల్లావ్యాప్తంగా సుమారు 980 మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

**వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు మేలు**

వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు గ్రాంటింగ్ ఎయిడ్ చట్టాన్ని రద్దు చేసి 010 పద్దు ద్వారా శాశ్వత ఉద్యోగులతో సమానంగా ప్రతినెలా 1వ తేదీ నాటికే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో సుమారు 1,500 మందికి మేలు జరుగనుంది.

**212 జీఓ ద్వారా సర్వీసు లెక్కించి..**

కంటింజెంట్, ఎన్ఎంఆర్‌లుగా తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్న వారికి మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 212 జీఓ ద్వారా వారి సర్వీసును లెక్కించి సర్వీసు నిబంధనలకు అనుగుణంగా వారిని రెగ్యులరైజ్ చేసేలా నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 500 మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

**సీపీఎస్ రద్దు పైనా..** సీపీఎస్‌ను వారం రోజుల్లోనే రద్దు చేస్తామని కేబినెట్ ప్రకటించడంపై జిల్లావ్యాప్తంగా ఉన్న 23 వేల మంది ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీపీఎస్ స్థానంలో నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఉద్యోగికి మేలు చేసేలా చర్యలు తీసుకుంటాననడంపై ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయడం సాహసోపేత నిర్ణయంగా ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు అభివర్ణిస్తున్నారు.

**నిరుద్యోగులకు సైతం..**

రాష్ట్రంలో వైద్య, ఇతర శాఖల్లో 6,500 పోస్టుల భర్తీకి మంత్రి మండలి తీర్మానించడంపై నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోమారు భారీస్థాయిలో ఉద్యోగ మేళా ఉండబోతోందని సంబరపడుతున్నారు.

### ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం హర్షం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వైద్యారోగ్య శాఖలో 2002 డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి ఆర్డర్ ఆఫ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా నియమించిన కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (3194) హర్షం ప్రకటించింది. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారిని రెగ్యులర్ చేయడాన్ని సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లా అప్పారావు, గోవిందరావు, గౌరవాధ్యక్షుడు డి.శామ్యూల్ రాజు, ఉపాధ్యక్షులు రత్నరాజు, నామాల రాజు, కాపా నాగరాజు, కృపవరం, ప్రసాద్‌బాబు, రామకృష్ణ, సారథి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### సాహసోపేత నిర్ణయం



వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల జీతాల చెల్లింపు గ్రాంటింగ్ విధానం ద్వారా జరిగేది. ఎన్నడూ లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రాంటింగ్ ఎయిడ్ రద్దు చేస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా 1వ తేదీనే జీతాలు తీసుకునే అవకాశం లభించింది.

– ఆర్ఎస్ హరనాథ్, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, జేఏసీ

### సర్వత్రా హర్షం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మంత్రి మండలి నిర్ణయాలపై జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నాం. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆనందకరమైన అంశం. అలాగే వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల జీతాలు, నూతన రిక్రూట్‌మెంట్ ఇలా ప్రతిఒక్కరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంది.

– చోడగిరి శ్రీనివాస్, జిల్లా ఎన్జీఓ అధ్యక్షుడు

### స్వాగతిస్తున్నాం



కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కంటింజెంట్ ఉద్యోగుల క్వాలిఫైడ్ సర్వీసు గుర్తింపు, శాశ్వత ఉద్యోగులతో సమానంగా వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జీతాల చెల్లింపు ఇలా ఉద్యోగులకు లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నాం.

– కె.రమేష్‌కుమార్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్, అమరావతి జేఏసీ అధ్యక్షుడు

### థ్యాంక్యూ సీఎం సార్



వైద్యవిధాన పరిషత్‌ను ప్రభుత్వ శాఖగా గుర్తిస్తూ, ఉద్యోగులందరికీ 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలపడం ఆనందంగా ఉంది. తద్వారా సుమారు 12 వేలకు పైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్‌ను నెరవేర్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వైవీఎస్‌బీ రాయుడు, వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సంఘం, తణుకు జిల్లా ఆస్పత్రి శాఖ కార్యదర్శి

# ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి

### కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

**నరసాపురం:** అధిక వర్షాలు, తుపాన్లు, వరదలు చుట్టుముట్టే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు సమర్థంగా ఎదుర్కొందుకు యాక్షన్ ప్లాన్స్ తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. గత అనుభవాల దృష్ట్యా సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. తుపానులు, వరదల సమయంలో నరసాపురం, యలమంచిలి, ఆచంట, పెనుగొండ, మొగల్తూరు మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్టు ప్రాంతాలపై నివేదికలు ఇవ్వాలన్నారు. నరసాపురం మాధవాయిపాలెం, కాజ, నక్కల డ్రెయిన్, లక్ష్మీపాలెం అవుట్ ఫాల్ స్లూయిస్ కల్వర్టు పనులు వేగంగా పూర్తి చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్‌ను ఆదేశించారు. నరసాపురం సబ్‌కలెక్టర్ ఎస్.సూర్యతేజ, జిల్లా నీటిపారుదలశాఖ అధికారి నాగార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎ.రామస్వామి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**నాణ్యతతో నాడు–నేడు పనులు**

**సాక్షి, భీమవరం:** మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో నాడు–నేడు పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పట్టణ పరిధిలోని రాజరాజేశ్వరి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, టీఎస్ఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను బుధవారం ఆమె పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. తొమ్మిది కంపోనెంట్స్‌తో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు.

**సచివాలయాల తనిఖీ :** పట్టణంలోని 23, 36వ వార్డు సచివాలయాలు, కొమరాడ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఆశాజనకమైన ఫలితాలు లేవని, వీటిని సాధించడంపై అధిక దృష్టి సారించాలన్నారు. పథకాల లబ్ధిదారుల జాబితాల్లో నోటీసు బోర్డుల్లో ఉంచాలన్నారు. ప్రతిరోజూ స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించాలన్నారు. డీఈఓ ఆర్.వెంకట రమణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మేనేజింగ్ ఇంజనీర్ పి.త్రినాథరావు, డీఈ నారాయణరావు, పబ్లిక్ హెల్త్ డీఈ విజయ్, ఏఈలు రవితేజ, శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# జెడ్పీ పీఠంపై బీసీ మహిళ

- జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ
- నేడు ప్రమాణ స్వీకారం

**ఏలూరు(మెట్రో):** జిల్లాపరిషత్ పీఠంపై నారీ శక్తి కొలువుతీరనుంది. జిల్లాపరిషత్ ఏర్పడిన అనంతరం మహిళకు మరోసారి జగనన్న ప్రభుత్వ పాలనలో అవకాశం లభించింది. ఈ మేరకు గురువారం లాంఛనంగా ఎన్నిక నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ తరఫున ఎస్‌బీఎస్ఎన్ రాజు విప్ జారీ చేశారు. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీని ఎన్నుకోనున్నట్టు తెలియజేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పచ్చజెండా ఊపి ఆశీర్వాదం అందించగా, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ లాంఛనం కానుంది. పద్మశ్రీ 22వ జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేయనున్నారు. ఇప్పటివరకూ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో జెడ్పీ పదవికి రాజీనామా చేశారు. దీంతో జిల్లాపరిషత్ చైర్మన్ అనివార్యమైంది.

**ఏర్పాట్లు పూర్తి :** జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గతనెల 31న నోటిఫికేషన్ జారీ చేసింది. కలెక్టర్‌ను ఎన్నికల అధికారిగా నియమిస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించి జెడ్పీ చైర్మన్‌ను నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా బీసీ మహిళకు చైర్మన్ పీఠాన్ని కట్టబెట్టడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

**రెండో మహిళగా..** పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ 1936లో జిల్లా బోర్డుగా ఏర్పడింది. 1959లో జిల్లా ప్రజాపరిషత్‌గా అవతరించింది. అప్పటి నుంచి 21 మంది జెడ్పీ చైర్మన్లుగా వ్యవహరించారు. వీరిలో 1995, 2000లో జెడ్పీ చైర్మన్‌గా ఇమ్మణ్ణి రాజేశ్వరి పనిచేయగా.. రెండో మహిళా చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### సుపరిపాలనకు కృషి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. జిల్లాపరిషత్ పీఠంపై రెండో మహిళగా బాధ్యతలు స్వీకరించనుండటం ఆనందంగా ఉంది. ప్రజలకు, అధికారులకు, నాయకులకు అందుబాటులో ఉంటూ సుపరిపాలనకు కృషిచేస్తా. నాకు ఈ అవకాశం కల్పించిన జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు.

– గంటా పద్మశ్రీ

## విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

**ఏలూరు (టూటౌన్):** ఏలూరు జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెనలో ఆర్థిక సాయం పొందేందుకు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీస్ సహాయ సంచాలకులు ఎస్ఎస్ కృపావరం ఓ ప్రకటనలో కోరారు. ప్రపంచంలో మొదటి 200 ర్యాంకులు ఉన్న విదేశీ విద్యాలయాలు, విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ అభ్యసించే మైనార్టీ విద్యార్థులు ఈ పథకానికి అర్హులుగా పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఆయిల్‌పామ్ సాగులో ఏపీ ప్రథమం

### వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి



గాలాయగూడెంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

**దెందులూరు:** దేశంలో ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, వైఎస్సార్ పాలనలో ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడంతో రైతులకు మరింత ప్రోత్సాహం లభించిందని ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. గాలాయగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య రాష్ట్ర నేత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముసునూరి సీతారామయ్య నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ రైతుల సంక్షేమానికి విశేషంగా కృషిచేస్తున్నారని, రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాలకు పైగా ఉద్యాన సాగు పెరిగిందని, హార్టికల్చర్‌లో హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా ఆదాయం వస్తుందన్నారు. రైతు భరోసా, ఈ–క్రాప్ విధానాన్ని అమలుచేస్తూ రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# ఆక్వా వర్సిటీకి వడివడిగా అడుగులు

- 140 పోస్టుల నియామకానికి కేబినెట్ ఆమోదం
- 2023–24 నుంచి కోర్సుల ప్రారంభానికి నిర్ణయం
- చురుగ్గా పరిపాలనా భవన నిర్మాణ పనులు



ఆక్వా వర్సిటీ పరిపాలనా భవనం నమూనా

**నరసాపురం:** నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. నరసాపురం మండలం సరిపల్లి, లికితపూడి మధ్య వర్సిటీ పరిపాలనా భవన నిర్మాణం శరవేగంగా సాగుతుండగా.. బుధవారం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వర్సిటీలో 140 పోస్టుల నియామకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీ పరిపాలనా వ్యవహారాల నిర్వహణకు సంబంధించి వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ వంటి 65 కీలక, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది కలిపి 75 పోస్టులు మొత్తంగా 140 మంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అలాగే రానున్న 2023–24 విద్యా సంవత్సరంలో వర్సిటీలో కోర్సులు ప్రారంభించాలని కూడా నిర్ణయించారు. మొదటి సంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీష్ సైన్స్, మాస్టర్ ఆఫ్ ఫిషరీష్ సైన్స్ కోర్సులు ప్రారంభం కానున్నాయి. తర్వాత ఏడాది పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభిస్తారు. వర్సిటీ ప్రత్యేకాధికారిగా ప్రొఫెసర్ ఒగిరాల సుధాకర్‌ను ప్రభుత్వం ఏడాది క్రితమే నియమించింది. పోస్టుల భర్తీ, కోర్సుల ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలపడంతో వచ్చే ఏడాది నుంచి వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ప్రత్యేక అధికారి సుధాకర్ తెలిపారు.

**రూ.600 కోట్లతో నిర్మాణం**

సుమారు 500 ఎకరాల్లో దాదాపు రూ.600 కోట్లతో నిర్మించనున్న వర్సిటీ నిర్మాణాలకు గతేడాది సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అలాగే రూ.100 కోట్లను తొలి విడతగా ప్రభుత్వం కేటాయించింది. దీంతో సరిపల్లి వద్ద పరిపాలనా భవనం నిర్మిస్తున్నారు. రానున్న ఐదేళ్లలో రూ.600 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. ఇక్కడ ఆక్వా వర్సిటీ దేశంలో మూడవది కాగా.. రాష్ట్రంలో మొదటిది. వర్సిటీ ఏర్పాటుతో రాష్ట్రంలోని 90 వేల మంది ఆక్వా రైతులు, పరోక్షంగా 8 లక్షల మంది ప్రజలకు మేలు జరుగుతుందని అంచనా.

### ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో..



ఆక్వా వర్సిటీ ఏర్పాటుపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కేబినెట్‌లో 140 పోస్టుల నియామకానికి ఆమోదం తెలిపారు. త్వరలో కోర్సులు ప్రారంభమవుతాయి. వర్సిటీ ఏర్పాటు ఆక్వా, మత్స్య రంగాల్లో నూతన విప్లవం. ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహం అవసరం. ఈ రంగ నిపుణులను తయారు చేసుకుని, సాగులో నైపుణ్యాలను పెంచుకుంటే ఆక్వా సాగులో నష్టాలు తగ్గుతాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

### ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్

**సాక్షి, భీమవరం:** కేంద్ర ప్రభుత్వం స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని డీఆర్వో కె.కృష్ణవేణి ఓ ప్రకటనలో తెలిపారు. లోయర్ డివిజన్ క్లర్క్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులు కోరారని, ఈనెల 8వ తేదీ వరకూ గడువు ఉందని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, ఆంధ్రప్రదేశ్‌లో 10 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు ఆగస్టులో నిర్వహిస్తారని పేర్కొన్నారు.



## న్యూస్‌రీల్

### ‘ఉపాధి’ పనుల పరిశీలన



ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అఖిల

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని అప్పారావుపేట, మెట్ట ఉప్పరగూడెం, దండగర్ర, జగన్నాథపురం, మాధవరం గ్రామాల్లో బుధవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అఖిల పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. మాధవరం ఫీల్డ్ ఛానల్‌లో ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులు చేసిన పనులను చూసి అభినందించారు. జగన్నాథపురంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎంపీటీసీ వీరమళ్ల వెంకన్న, ఎన్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.వీరాస్వామి, కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎంపీడీఓ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

### ఎంటీయూ రకాలపై రైతుల మొగ్గు



మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద వరి విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

**పెనుమంట్ర:** మార్టేరు వరిపరిశోధనా స్థానంలో బుధవారం వరి విత్తనాల విక్రయాలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి 9వ తేదీ వరకు విత్తనాల అమ్మకాలు సాగుతాయని పరిశోధనా స్థానం ముందుగా ప్రకటించడంతో ఉదయం నుంచి రైతులు బారులు తీరారు. అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారని పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి తెలిపారు. ఎంటీయూ 1118, ఎంటీయూ 1262, ఎంటీయూ 3626, పీఎల్ 1100, ఎంటీయూ 1121 రకాలను రైతులు ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. తెలంగాణ ప్రాంత రైతుల నుంచి పొడవు గింజ రకాలైన 1273, ఎంటీయూ 1293ను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. విడుదలకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ 1271, ఎంటీయూ 1282 రకాలను కూడా రైతులు ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్ చూస్తే సార్వాలో ఎంటీయూ 1318 సాగుకు రైతులు ఎక్కువ మొగ్గు చూపుతున్నట్టు ఆమె చెప్పారు. మరో రెండు రోజుల పాటు విత్తనాలు విక్రయిస్తామని తెలిపారు.

### ‘పది’ సప్లిమెంటరీకి 79 శాతం హాజరు

**సాక్షి, భీమవరం:** జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 6,434 మంది విద్యార్థులకు 5,083 మంది హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. 1,351 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 79 శాతం హాజరు నమోదైందన్నారు. జిల్లాలోని 23 కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, డీఈఓ తనిఖీలు చేశారని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని చెప్పారు.

### నేడు నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక



కొమ్ము వెంకటేశ్వర రావు, అభ్యర్థి

**నూజివీడు:** నూజివీడు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికను గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన షేక్ అమీరున్నీసా బేగం తన పదవికి రాజీనామా చేయగా ఎన్నిక అనివార్యమైంది. రిటర్నింగ్ అధికారిగా సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ వ్యవహరిస్తారు. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్‌గా కొమ్ము వెంకటేశ్వరరావు ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కౌన్సిల్‌లో 32 వార్డులుండగా 25 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ తమ అభ్యర్థిగా 22వ వార్డు కౌన్సిలర్ వెంకటేశ్వరరావును ప్రకటించింది. టీడీపీ నుంచి పోటీలో ఉండే అవకాశం లేకపోవడంతో వెంకటేశ్వరావు ఏకగ్రీవం కానుంది. వైస్ చైర్మన్ ఎన్నికకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

### ఉప కార్మిక కమిషనర్‌గా శ్రీనివాస్

**ఏలూరు(మెట్రో):** ఏలూరు జిల్లా ఉప కార్మిక కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాస్ బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు.

## క్లుప్తంగా

### కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. బుధవారం సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు జంక్షన్‌లో కారును తనిఖీ చేయగా 9 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఏలూరు మండలం శ్రీనివాసరావుపేటకు చెందిన కొల్లూరి తేజప్రసాద్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నాలబత్తుల విజయ్‌కుమార్ ముంచంగిపుట్టు మండలం శివారులో కొనుగోలు చేసిన గంజాయిని పాడేరు వైపు కారులో తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గంజాయి, కారు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో హెచ్‌సీ సత్యారావు,సిబ్బంది పాల్గొన్నారు.

### మునిసిపల్ అటెండర్ సస్పెన్షన్

నరసాపురం: తరచూ మద్యం తాగి విధులకు హాజరవుతున్న అటెండర్‌ను మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సస్పెండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న సీహెచ్ వెంకటేశ్వరరావు రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడు. బుధవారం కూడా తప్పతాగి విధులకు హాజరవ్వడంతో గుర్తించిన కమిషనర్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారితో బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయించారు. దీనిలో హాల్కహాల్ 336.80 మోతాదు ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది.

# పారిశ్రామిక రంగ అభివృద్ధికి చేయూత

- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి
- ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా సేవ, పారిశ్రామిక అనుబంధ రంగాలకు సహకారం
- నేడు ఆకివీడులో ఎంఎస్‌ఎంఈ జాతీయ కౌన్సిల్ సమావేశం



పెంటపాడు మండలం ప్రత్తిపాడులో ఎంఎస్‌ఎంఈ ద్వారా నెలకొల్పిన క్యాటిల్ ఫీడ్ పరిశ్రమ

ఆకివీడు: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు, వ్యాపారాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సంస్థలు ఇతోధికంగా సహకారం అందిస్తున్నాయి. 2006లో కేంద్ర ప్రభుత్వం స్థాపించిన ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా వస్తు తయారీ, ఉత్పత్తి చేసే పరిశ్రమల స్థాపన, సేవ, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఆయా పరిశ్రమల స్థాయిని బట్టి రుణాలను అందిస్తున్నాయి. వ్యాపారం, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సెక్యూరిటీ లేని రుణాల్ని బ్యాంకులు అందజేస్తాయి. అలాగే రూ.20 లక్షల లోపు సూక్ష్మ, రూ.20 లక్షలు నుంచి రూ.5 కోట్ల వరకు చిన్న తరహా, రూ.5 కోట్ల నుంచి ఆపై పరిశ్రమను బట్టి రూ.5 కోట్లు పైబడి రుణాలను సబ్సిడీలపై అందజేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్‌లు ఉన్నాయి.

**ఎంఎస్‌ఎంఈలో నమోదు**

ఎంఎస్‌ఎంఈలో నెలకొల్పే సంస్థ వివరాల్ని ఆధార్ అనుసంధానంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా అనేక లాభాలు చేకూరనున్నాయి. నూతన విధానం ద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో ఐటీలో పొందుపరచిన విధంగా దరఖాస్తులో పెట్టుబడి వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఐటీ లేకుండా కూడా మరి కొన్ని రుణాలకు అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ ద్వారా సెక్యూరిటీ లేకుండా రుణ సదుపాయం, ఇతర రాయితీలు లభిస్తాయి. విద్యుత్, సర్వీస్ చార్జీలు ఉండవు. ఆయా రంగాల్లో అనుభవం లేకుండా కూడా రుణ సదుపాయం కల్పిస్తారు. ఏరియా వైజ్ వ్యాపారం ఉంటుంది. ఐఎస్‌ఓ సర్టిఫికెట్ చార్జీలు ఉండవు. కరోనా వంటి విపత్తుల సమయంలో రుణ వాయిదాలకు అవకాశం ఏర్పడింది. వడ్డీ మాత్రమే చెల్లించేలా సౌకర్యం కల్పించారు. క్రెడిట్ కార్డును 80 శాతం మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని స్కీమ్‌లకు సబ్సిడీలు, రుణ సదుపాయాలు కల్పిస్తారు.

**పెరుగుతున్న ఆదరణ**

రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలో దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక కమిటీని కూడా నియమించారు. కమిటీ ద్వారా పలు దరఖాస్తులు ఎంఎస్‌ఎంఈకి చేరాయి. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేందుకు ఎంఎస్‌ఎంఈలకు అధిక ప్రాధాన్యతను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలకు అధిక ప్రోత్సాహం లభిస్తోంది.

**ప్రమోషన్ కౌన్సిల్, కమిటీలతో మరింత సేవ**

ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్, కార్పొరేషన్‌లతో లబ్ధిదారులకు మెరుగైన సేవలందుతున్నాయి. ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన ముడిసరుకు, యంత్రాలను అందజేయడం, సేవల్లో భాగంగా ఉత్పత్తుల అమ్మకం వంటివి చేపడుతున్నారు.

**జిల్లాలో ఎంఎస్‌ఎంఈ యూనిట్లు**

జిల్లాలో ఎంఎస్‌ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. గత ఏడాది 5 వేల దరఖాస్తులు లక్ష్యం కాగా, 3,891 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. పెట్టుబడులు రూ.625 కోట్లకు గానూ రూ.376 కోట్లు పెట్టుబడులతో 6,250 మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యాన్ని మించి 13,753 మందికి ఉపాధి కల్పించారు. ఈ ఏడాది గత రెండు నెలలుగా ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ల లక్ష్యం నిర్దేశించుకోనప్పటికీ 323 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా, రూ. 25.89 కోట్లు పెట్టుబడులతో నెలకొల్పిన పరిశ్రమలు, సేవా సంస్థల ద్వారా 1062 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన**

ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ జాతీయ సమావేశం గురువారం ఆకివీడులోని వీ.కన్వెన్షన్ హాలులో జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం జరుగుతుంది. ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలు సమావేశానికి హాజరై వారి అభిప్రాయాలు, సమస్యల్ని నివృత్తి చేసుకునే అవకాశం ఉంది.

### అన్నింటా సహకారం



ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న విధంగా ఏర్పాటు చేసే పరిశ్రమ, వ్యాపారానికి సంబంధించిన యంత్ర పరికరాలు, ముడి సరుకులు అందజేస్తారు. ఉత్పత్తి చేసిన వస్తువుల్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విక్రయానికి సహకారం అందిస్తాం.

– పువ్వాడ రాజా అమర్‌నాథ్, రాష్ట్ర వైస్ చైర్మన్, ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్

### చురుగ్గా దరఖాస్తుల పరిశీలన



ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. గత ఏడాది రూ.376 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు, సర్వీస్ సంస్థలు ఏర్పడగా లక్ష్యం కంటే 13,753 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం. ఈ ఏడాది 353 దరఖాస్తులతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

– ఉయ్యాల ఆదిశేషు, జీఎం, ప.గో.జిల్లా పరిశ్రమల శాఖ, భీమవరం

### మృతదేహాలు తల్లిదండ్రులకు అప్పగింత

మొగల్తూరు: పేరుపాలెం బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి మృతి చెందిన రాజేష్, వినయ్‌ల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏఎస్‌ఐ బండి సత్యనారాయణ బుధవారం చెప్పారు. పాలకొల్లులో రాజేష్ సోదరి పెళ్లికి వచ్చిన అతనితో పాటు స్నేహితుడు బండారు వినయ్ మంగళవారం సాయంత్రం సముద్రస్నానానికి దిగి మృతి చెందిన విషయం తెలిసిందే. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వజ్జిపోతు సత్యనారాయణ, నాగవేణిలకు రాజేష్ మృతదేహాన్ని, హైదరాబాద్ నుంచి వచ్చిన బండారు సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మిలకు వినయ్ మృతదేహాన్ని అప్పగించినట్లు ఆయన తెలిపారు. చేతికంది వచ్చిన కుమారులు కానరాని లోకాలకు వెళ్ళిపోవడాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటి తడి పెట్టించింది.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ఘటనా స్థలంలో పిచ్చియ్య మృతదేహం

ద్వారకాతిరుమల: వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి మోపెడ్‌పై వెళుతున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరలిలా ఉన్నాయి. బుట్టాయిగూడెంకు చెందిన చిలకా పిచ్చియ్య (65) దెందులూరు మండలం శ్రీరామవరంలో బంధువుల పెళ్లికి బుధవారం మోపెడ్‌పై వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం స్వగ్రామానికి వెళుతుండగా, ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పిచ్చియ్య ఘటనా స్థలంలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు.

### చికిత్స పొందుతూ ప్రైవేట్ ఉద్యోగి మృతి

జంగారెడ్డిగూడెం: సహ ఉద్యోగి తీరుతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ ఉద్యోగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. బుట్టాయగూడెం రాజీవ్‌నగర్‌కు చెందిన కాసారపు వెంకటేశ్వరరావు (25) పట్టణంలోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. సహ ఉద్యోగి అగ్గాల శ్రీనివాసరావు కంపెనీకి చెందిన రూ.2.60 లక్షలను వ్యక్తిగత అవసరాలకు వాడుకుని, సదరు నగదును వెంకటేశ్వరరావు వాడుకున్నట్లు అధికారులను నమ్మించాడు. దీనిపై వెంకటేశ్వరరావు సహ ఉద్యోగిని నిలదీయగా చెల్లిస్తానని తొలుత పేర్కొన్నా, తరువాత సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న సంస్థ కార్యాలయంలో విషాన్ని సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు అతనిని స్థానిక ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఐస్ ఫ్యాక్టరీపై ఫిర్యాదు.. డీఆర్వో విచారణ



అజ్జమూరులో ఐస్‌ఫ్యాక్టరీపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

ఆకివీడు: స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీఓ దాసి రాజు బుధవారం విచారణ చేపట్టారు. అజ్జమూరులో ఉన్న ఐస్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు, కలుషిత నీరు పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ అధికారులు విచారణ నిర్వహించారు. ఆ ప్రాంత రైతులు చేసిన ఫిర్యాదు మేరకు కాలుష్యపు నీరు ఏ విధంగా పంట కాల్వలోకి కలుస్తుందో పరిశీలించారు. ఏ విధంగా అనుమతులు ఇచ్చారో పరిశీలన చేశారు. ఆయా అంశాల్ని పరిశీలించి తదుపరి చర్యలుంటాయని ఆర్డీఓ రాజు వివరించారు. స్పందనలో ఏ ఫిర్యాదులు వస్తున్నాయి, వాటిలో నాణ్యత ఎంత, ఎవరెవరు ఫిర్యాదులు తరచుగా చేస్తున్నారు, ప్రజల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు వస్తున్నాయనే అంశంపై మండల అధికారులతో ఆర్డీఓ రాజు సమీక్షించారు. అనంతరం తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల్ని పరిశీలించారు. మిగిలిన లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయాల సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, పొల్యూషన్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

### పాకలు దగ్ధం

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ యడ్లగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు తాటాకు పాకలు దగ్ధమయ్యాయి. బుధవారం రాత్రి 11కేవీ విద్యుత్ వైర్లకు కాకి తగలడంతో ఒక వైరు తెగి పడి మంటలు చెలరేగి పాకలకు అంటుకున్నాయి. యడ్ల వినోద్‌కు చెందిన చికెన్‌షాపు, పాన్ షాపు ఉన్న పాకలు, కట్టూరి రామారావుకు చెందిన మేకల పాక పూర్తిగా దగ్ధమయ్యాయి.



# కడలిని కాపాడుకుందాం

- కాలుష్యం బారిన జలాలు.. అంతరిస్తున్న వేల జీవరాశులు
- పర్యావరణంపైనా ప్రభావం.. అవగాహనతోనే సాగరాల రక్షణ
- నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం



పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులు (ఫైల్)

మొగల్తూరు: సముద్రాలు కాలుష్య కోరల్లో చిక్కుకుని ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. వ్యర్థాలు, జలాల కలుషితం కారణంగా సాగరాల్లో అనేక జీవరాశులు అంతరిస్తున్నాయి. ప్రమాదపుటంచున ఉన్న సముద్రాలను పరిరక్షించే దిశగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు స్పందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా జూన్ 8వ తేదీన ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 1992లో బ్రెజిల్‌లోని రియో డిజనిరీలో జరిగిన ధరిత్రి సదస్సులో సముద్రాలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని ఏటా జరుపుకోవాలని కెనడా దేశం ప్రతిపాదించగా మిగిలిన దేశాలన్నీ ఆమోదించాయి. అయితే సముద్రాలు చెత్తా చెదారాలతో నిండిపోతున్నా పర్యావరణానికి ముప్పు తెప్పిస్తున్నా కొన్ని దేశాలు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో మత్స్య సంపదతో పాటు సముద్రం నుంచి లభించే వివిధ రకాల సంపదలు కనుమరగవుతున్నాయి.

**చేపలకంటే ప్లాస్టిక్ ఎక్కువ**

సముద్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల 2050 నాటికి దాదాపు 40 శాతం జలజీవ జాతులు అంతరించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పటికి సముద్రాల్లో చేపల కంటే ఈ వ్యర్థాలే ఎక్కువగా ఉంటాయని పర్యావరణవేత్తలు కలవరపడుతున్నారు.


**జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సాగర తీరం**

జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సాగరతీరం ఉంది. అయితే జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చే డ్రెయిన్‌లు, ఉప్పుటేరులలో కలుషితమైన నీరంతా పేరుపాలెంలో సముద్రంలోకి చేరుతోంది. దీంతో కాలుష్యం పెరిగి సముద్ర జాతులు కనుమరుగవుతున్నాయి. నియోజకవర్గంలో సముద్ర వేటపై సుమారు 1000 మంది మత్స్యకారులు దాదాపు 300 పడవలతో నిత్యం సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే గతంలో వలే సముద్ర ఉత్పత్తులు తగ్గిపోవడంతో వేటే ఆధారంగా జీవించే తాము సరైన ఆదాయం లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం వల్ల అలల ఉధృతి పెరిగి గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. తీరంలోని చినమైనవానిలంక, బియ్యపుతిప్ప గ్రామాల్లో సముద్రం దాదాపు మూడు కిలోమీటర్ల ముందుకు చొచ్చుకువచ్చి సరుగుడు, కొబ్బరితోటలు కనుమరుగయ్యాయి.

**ఆహ్లాదపరుస్తున్న పేరుపాలెం బీచ్**

జిల్లాలోనే ఏకైక బీచ్‌గా పేరుగాంచిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌గా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం సాగరతీరాలు పర్యాటకులను ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రతి ఏటా కార్తీకమాసంలో లక్షలాది మంది సందర్శకులు బీచ్‌ను సందర్శించి పుణ్యస్నానాలు చేస్తారు. అయితే నిత్యం సందర్శకుల రాకతో పేరుపాలెం బీచ్ చెత్తా చెదారాలతో కాలుష్య నీటితో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పేరుపాలెం తీరంలో ప్లాస్టిక్ వస్తువులను కలెక్టర్, అధికారులు ఏరివేశారు. పర్యావరణవేత్తలు, ప్రజాప్రతినిధులు స్పందించి పేరుపాలెం బీచ్‌ను కాలుష్య రహిత బీచ్‌గా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.


### పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌గా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయకుండా గట్టి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి.

– కత్రి ఏసుబాబు, పేరుపాలెం

### సముద్రాలను రక్షించాలి



కాలుష్యం బారిన పడుతున్న సముద్రాలను రక్షించాలి. పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు సముద్రాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి. అంతరించిపోతున్న మత్స్యసంపదను కాపాడేందుకు కృషి చేయాలి.

– శంకరపు శ్రీనివాసరావు, మోళ్లపర్రు

## వైరల్ లోడు పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అరుణ తదితరులు

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ బాధిత గర్భిణులు క్రమం తప్పకుండా వైరల్ లోడు తదితర వైద్య పరీక్షలు చేయించుకోవాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ సూచించారు. ఆస్పత్రి ఆవరణలోని సేఫ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ముద్రించిన వైరల్ లోడు పరీక్షల పోస్టర్‌ను అరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధిత గర్భిణులు సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలకు హెచ్‌ఐవీ సోకకుండా చూసుకోవచ్చన్నారు. బిడ్డ జన్మించిన తరువాత కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. హెచ్‌ఐవీ బాధిత గర్భిణి తప్పనిసరిగా 32–36 వారాల మధ్య వైరల్ లోడు పరీక్ష చేయించుకోవడం ద్వారా గర్భంలోని శిశువు ఆరోగ్య స్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చన్నారు. తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యకుమారి, సేఫ్ కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శ్రీకృష్ణ పరమాత్మకు విశేష పూజలు



ప్రత్యేక పూలతో అలంకరించిన శ్రీకృష్ణ పరమాత్మ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధవారం కృష్ణ పరమాత్మకు, పరివార దేవతలకు విశేష పూజలు, అనంతరం హరిసర్వోత్తమ భజన మండలి సభ్యులచే పురందరదాసు కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. ప్రవచనాల్లో భాగంగా సత్యహరిశ్చంద్ర ధర్మాన్ని, సత్యవాక్ పరిపాలన విధానాలను గురించి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజులు తదితరులు పాల్గొన్నారు.

### బస్ షెల్టర్‌ను ప్రారంభించిన సర్పంచ్



పెదతాడేపల్లి వద్ద బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నవరం

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో తాడేపల్లిగూడెం – నల్లజర్ల రహదారిని ఆనుకుని దాత పరిమి వెంకట్రావు నిర్మించిన బస్ షెల్టర్‌ను బుధవారం గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత వెంకట్రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో బుధవారం క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ మదన్మోహన్ అగర్వాల్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థినికి సైకిల్, మహిళకు కుట్టు మిషన్ పంపిణీ, ఇతర సేవలు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ పట్టణ అధ్యక్షులు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ వి.రామమోహన్‌రావు, కోశాధికారి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పేరిచర్ల మురళీకృష్ణం రాజు, సుంకర శ్రీనివాస్, సత్తి జగదీష్ రెడ్డి, వట్టిప్రోలు రాము తదితరులు పాల్గొన్నారు.

### సుబ్బాయమ్మ మృతికి ఎమ్మెల్సీ సంతాపం

**తణుకు టౌన్:** తణుకు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముదిగిన సత్యనారాయణ తల్లి సుబ్బాయమ్మ మృతి పట్ల ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు. బుధవారం తణుకులోని ముదిగిన సత్యనారాయణ నివాసానికి వెళ్లి సుబ్బాయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి కాశిరెడ్డి, తదితరులు ఉన్నారు.

### ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**పెనుగొండ:** పెనుగొండ బీడులో నూతనంగా నిర్మించే సంపత్ వినాయకుని ఆలయానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నలిమిల్లి వేణు ప్రతాపరెడ్డి (బాబీ), ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, చెన్న కేశవ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే అప్పారావు, పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

**మొగల్తూరు:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ జి.అనితా కుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు.

# ఆందోళన వీడితే ఆరోగ్యం



కొండేపాడు, రావిపాడు గ్రామాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ముదునూరు పీహెచ్‌సీ డాక్టర్ పూజిత



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాలతో నిండిన ఆహారాన్ని తీసుకుంటున్న గర్భిణులు

- కాబోయే అమ్మల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఆసుపత్రుల్లో గర్భిణులకు అవగాహన

**పెంటపాడు:** ఒత్తిడి మనిషిని మానసికంగా క్రుంగదీస్తుంది. రోగాలబారిన పడేస్తుంది. ఇంటా, బయటా పనులు చక్కదిద్దే మహిళలు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతారు. ప్రధానంగా గర్భం దాల్చిన స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలి. లేకపోతే ఇబ్బందులు ఎదురౌతాయి. ప్రధానంగా బీపీ రావడంతోపాటు, గర్భదారణ సమయంలో అనేకసమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి, ఆకలిలేకపోవడం, కొన్నిసార్లు గర్భస్రావం అయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇటువంటి సమస్యలను అధికమించేందుకు ప్రభుత్వం గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించింది. మాతా శిశుమరణాలు పూర్తిగా అరికట్టేందుకు, తొలి, మలి సారి కాన్పుల్లో పండంటి బిడ్డ పుట్టేందుకు పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా 8న మాతృత్వ వందన యోజన ద్వారా ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తూ తల్లీ బిడ్డల సంక్షేమానికి సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా గర్భిణులు ఒత్తిడిని ఎలా అధికమించాలో ఆసుపత్రుల్లోనే అవగాహన కల్పిస్తున్నారు. పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 276 మంది, ముధునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 235 మంది గర్భిణులు ఉన్నారు. వీరికోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణపోషణ, పోషణప్లస్, ఫోర్టిఫైడ్ బియ్యం, కోడి గుడ్లు, పాలు, బెల్లం, ఖర్జూరం, ఆయిల్, రాగిపిండి లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందిస్తోంది.

**గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గర్భిణులు తొలి ఐదు నెలలు అత్యంత జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువ బరువులు ఎత్తకూడదు. ఆందోళన పడకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలంటే నలుగురితో మాట్లాడుతూ ఉండాలి. ఎప్పుడూ ఆందోళన లేకుండా నవ్వుతూఉండాలి. సరైన ఆహారం తిని వేళకు నిద్రపోవాలి. తేలికపాటి వ్యాయామం చేయాలి.

#### అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు ఒత్తిడిని ఎలా అధికమించాలో ప్రభుత్వాసుపత్రుల్లో కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నాం. డాక్టర్లు పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీస్తుంటారు. ప్రతి నెలా 9న ఆసుపత్రుల్లో గర్భిణులపై మాతృత్వ వందన యోజన ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి కాన్పు జరిగే వరకు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్వీ రమణ,
ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

### గోశాల నిర్వాహణకు సమస్యలు సృష్టించవద్దు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని 6వ వార్డులో నిర్వహిస్తున్న భక్తాంజనేయ గోశాల నిర్వాహణకు సమస్యలు సృష్టించవద్దని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు, యువమోర్చా అధ్యక్షుడు గరగ ప్రసాద్‌లు హెచ్చరించారు. పట్టణంలో నిర్వహిస్తున్న గోశాలను బీజేపీ నాయకులు బుధవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ గోవులవల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, అటువంటి గోశాలను నిర్వహించకుండా చేసేందుకు కొందరు సమస్యలు సృష్టిస్తున్నారని, అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గోశాల నిర్వాహణకు అడ్డుపడితే బీజేపీ పార్టీ తరుపున ఉద్యమిస్తామన్నారు. గోశాల నిర్వాహకులు నార్ని త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.

### నేడు మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక

**పెంటపాడు:** మండలంలోని మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక గురువారం ఉదయం 11గంటలకు మండల సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రొసైడింగ్ అధికారి, డీపీవో, మండల పరిషత్ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు సమక్షంలో ఈ ఎన్నిక జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

# జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



గృహ నిర్మాణాల పై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అధికార్లు

**తణుకు టౌన్:** నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో మండలంలోని పేదలంరికీ గృహాల నిర్మాణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయడం ద్వారానే త్వరితగతిన పూర్తి చేయగలమని ఎంపీపీ రుద్రా ధనరాజు చెప్పారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గృహ నిర్మాణాలపై అధికారులు, సర్పంచ్‌లు, నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గ్రామాల్లోని స్థానిక ప్రతినిధులు ఇళ్ల నిర్మాణానికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న గృహ నిర్మాణ శాఖ డీఈ కేకేడీటీవీ ప్రసాద్ మాట్లాడుతూ గృహ నిర్మాణంలో వచ్చిన మార్పులను వివరించారు. మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో గృహాల నిర్మాణాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు, స్వయం సహాయ సంఘాల సభ్యులు కూడా తమ పరిధిలోని గృహాల నిర్మాణాల పట్ల సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీవీ రామ్‌ప్రసాద్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, నాయకులు ముళ్లపూడి బాబూరావు, నున్న దుర్గాప్రసాద్ ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయ దుర్గ, సర్పంచ్ పాలా శ్రీను, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది, గృహ నిర్మాణ, సీబ్బంది పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం



గూడెం వేసవి శిక్షణశిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



అత్తిలిశాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో గ్రేడ్ –1 గ్రంథాలయంలో 30వ రోజు బుధవారం వేసవి శిక్షణ శిబిరం ఆహ్లాదకరంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. యోగా ట్రైనర్ దుర్గమ్మ విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించారు. విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజు రసాయనశాస్త్రం, సంకేతాలు, సాంకేతికాలు, సంయోజనీయత, మూలకాలు, సంయోగ పదార్థాలు, పలు అంశాలు బోధించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే తెలుగు సూక్తులు, నీతిపద్యాలతో పాటు దేశభక్తి గేయాలలో పోటీలు నిర్వహించారు. ఎ.జనార్ధనరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావులు పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

**స్వాతంత్ర్య సమరయోధులపై అవగాహన**

**అత్తిలి:** వేసవి సెలవులలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పలు అంశాలపై శిక్షణ పొందారని గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు చెప్పారు. వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు గురించి రిటైర్డు గ్రంథాలయాధికారి కె కృష్ణారావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డేవిడ్‌రాజు, వి గణపతి, ఎం శ్రీదేవి, వంశి తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధిలో వ్యాపారుల భూమిక కీలకం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దేశ అభివృద్ధిలో వ్యాపారుల భూమిక కీలకమైనదని, సులభతర వర్తక వ్యాపారాల నిర్వహణ కోసం కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యంత వేగవంతమైన చర్యలు తీసుకుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పచందు సాంబశివరావు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా వ్యాపారులతో ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి తాడేపల్లిగూడెం పట్టణంలోని గమిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ ఆహారధాన్యాలు ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించే విధంగా కృషి చేయాల్సిన అవశరం ఎంతైనా ఉందన్నారు. ఏకీకృత వస్తు సేవలు పన్ను జీఎస్టీ విధానాన్ని అమలు చేసిన తరువాత వ్యాపారులు తమ కార్యకలాపాలకు వీలు కలిగిందని, జీఎస్టీ ఆదాయం నేటికి నెలకు 1,67 వేల కోట్లు చేరిందని వెల్లడించారు. యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి మిట్ట వంశీకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, బీజేపీ మాజీ సైనికుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు టి.భోగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు గమిని సుబ్బారావు, ప్రముఖ వ్యాపారవేత్తలు నంద్యాల కృష్ణమూర్తి, పసుపులేటి వెంకట రామారావులు ఉల్లి రైతులు, ఆక్వారంగంపై మాట్లాడారు. నరిసే సోమేశ్వరరావు, జిల్లా నుంచి వచ్చిన వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మావుళ్లమ్మవారి జ్యేష్ట మాస జాతర

**భీమవరం (ప్రకాశం చౌక్):** మావుళ్లమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి జాతరలో పాల్గొనాలని కోరారు.

### ఘనంగా పృథ్వీరాజ్ చౌహాన్ జయంతి



నాగిడిపాలెంలో పృథ్వీరాజ్ చౌహాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**భీమవరం అర్బన్:** దేశం గర్వించదగ్గ గొప్ప జాతీయ వీరుడు పృథ్వీరాజ్ చౌహాన్ అని, దేశ సంపదను ఇతరులు పాలు కాకుండా తన పోరాట పటిమతో ఎంతోమందిని మట్టి కరిపించారని అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెమ్మాడి కిరణ్ కుమార్, జాతీయ అధికార ప్రతినిధి కొల్లాటి రాజ్‌కుమార్ వర్మ అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెంలో పృథ్వీరాజ్ చౌహాన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్ వర్మలు మాట్లాడుతూ భారతదేశంపై 16సార్లు దండెత్తిన మహ్మద్ ఘోరీని ఓడించి రాజ్య స్థాపనను పృథ్వీరాజ్ చౌహాన్ సుస్థిరం చేశారన్నారు. పృథ్వీరాజ్ చౌహాన్ దేశ భక్తితో తన వీరత్వంతో ఎంతోమంది విదేశీ చక్రవర్తులను ఓడించారని గుర్తు చేశారు. మొట్టమొదటి అగ్నికుల క్షత్రియ చక్రవర్తిగా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించారన్నారు. ముందుగా పృథ్వీరాజ్ చౌహాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఆర్థిక సాయం అందజేత



తణుకులో బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.25వేల చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

**తణుకు టౌన్:** గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం తణుకు మానవత సంస్థ రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు తెలిపారు. బుధవారం తణుకు గమిని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గుండె వ్యాధితో భాదపడుతున్న జీ సుబ్బారావు కుటుంబ సభ్యులకు రూ. 25 వేల చెక్కును అందజేశారు. మానవత సేవల నిమిత్తం తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల వ్యవస్థాపకులు చిట్టూరి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సత్య ఉషారాణి రూ.10 వేలు ఆర్థిక సహాయంతో పాటు మానవత సంస్థ మరో రూ. 15 వేలు ఆర్థిక సహాయం మొత్తం రూ. 25 వేలు సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కే రాధాపుష్పావతి, కార్యదర్శి కొల్లేపర సత్యనారాయణ, కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, ఆనందం మస్తాన్‌రావు, కేవీ రమణమూర్తి, అక్కిన కాశీ, ఆలపాటి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

### శరవేగంగా సచివాలయ భవన నిర్మాణం

**కాళ్ల:** మండలంలో సీసలి గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గణేశ్నరాం బాబు పర్యవేక్షణలో నిర్వహిస్తోన్న ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్ బుధవారం పరిశీలించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### గడ్డివాము దగ్ధం

**ఉండి:** స్థానిక దేవునిగుడిదొడ్డి ప్రాంతంలో గేదెల వ్యాపారి బూరాడ సత్తిబాబుకు చెందిన గడ్డివాము బుధవారం ఉదయం విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ జిల్లా ఇన్‌చార్జి సాలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

# పర్లమ్మవారికి వెండి కవచం సమర్పణ



ఎల్ఎస్‌పురంలో పర్లమ్మవారికి వెండి కవచాన్ని సమర్పిస్తున్న భక్తులు

**కాళ్ల:** మండలంలోని ఎల్ఎస్‌పురం శ్రీశ్రీశ్రీ పర్లమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మందపాటి పేర్రాజు, వెంకటలక్ష్మి దంపతుల కుమారులు హరికృష్ణ, రామాంజనేయులు ఆర్థిక సాయం రూ.లక్షతో వెండికవచాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ కవచాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు అమ్మవారికి అలంకరించారు. దాత కుటుంబన్ని గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరావులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామస్తులంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తానింకి నాగరాజు, ఎంపీటీసీ శీలబోయిన సత్యనారాయణ, బొండాడపేట సర్పంచ్ గోళ్ల వెంకట సత్యనారాయణ, ఉద్దరాజు శ్రీనివాసరాజు, మందపాటి వెంకన్న, కందుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ అధిక బిల్లులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వారైతు సత్యనారాయణ

**కాళ్ల:** విద్యుత్తు, మత్స్య శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వచ్చాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లకూరు గ్రామంలో అధిక విద్యుత్ బిల్లులు రావడంపై ఆక్వా రైతులు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో సబ్సిడీ పోను రూ.50 వేలు వచ్చే విద్యుత్ బిల్లులు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు వరకు వచ్చాయన్నారు. కాళ్లకూరులో 39 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ తొలగించి, అధిక విద్యుత్ బిల్లులు వేయడం దారుణమన్నారు. కాళ్ల మండలంలో 180 మంది ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఫిషరీస్ అధికారులు ఈ షిప్ నమోదు చేయలేదన్నారు. దీంతో గత కొంత కాలంగా తమకు వస్తున్న విద్యుత్ సబ్సిడీలను తొలగించి విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 180 మంది రైతులకు ఈ షిప్ నమోదు చేసి, తొలగించిన విద్యుత్ సబ్సిడీలను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో బొర్రా వీర వెంకట సత్యనారాయణ, తానుకొండ వెంకట్రావు, దండు ప్రణవమూర్తి రాజు, పెన్మెత్స పృథ్విరాజు, పెన్మెత్స సురేష్ రాజు, కె.నాగేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, డొక్కు సుబ్రహ్మణ్యం, వీరమల్లు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**భీమవరం అర్బన్:** భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడని అందిన ఫిర్యాదుమేరకు బుధవారం పోలీసులు కేసు నమోదుచేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్‌వీఎన్ పురంగా గ్రామ శివారుకు చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మోకా అర్జునరావు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ హెల్మెట్లు



ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ హెల్మెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

**సాక్షి, భీమవరం:** మండు టెండలో సైతం ట్రాఫిక్ పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎండలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు ప్రభుత్వం ఎయిర్ కూలింగ్ హెల్మెట్లను ప్రభుత్వం అందిస్తోంది. దీనిలో భాగంగా భీమవరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎయిర్ కూలింగ్ హెల్మెట్ల ట్రయల్స్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయనే స్వయంగా ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు హెల్మెట్ అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ట్రాఫిక్ పోలీసు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ముఖ్యంగా దుమ్ము దూళితో పాటుగా మండుటెండలో సైతం తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఎయిర్ కూలింగ్ హెల్మెట్లను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, తోట భోగయ్య, ఏఎస్ రాజు, ట్రాఫిక్ సీఐ దాసు పాల్గొన్నారు.

**సత్యనారాయణమ్మ మృతి తీరని లోటు**

**వీరవాసరం:** మాజీ ఎంపీటీసీ సభ్యులు కడలి సత్యనారాయణమ్మ మృతి తీరని లోటని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు . రాయకుదురు ఆమె స్వగృహంలో ఎంపీటీసీ చిత్రపటానికి పూల మాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భీమవరం జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గూడూరి ఓంకార్, కడలి ధర్మారావు, కడలి సత్యనారాయణ, కడలి శ్రీనివాస్, గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్, పేరిచర్ల విజయ నరసింహ రాజు, ఏఎస్ఎన్ రాజు, తోట భోగయ్య, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

**క్రీడలతో మానసిక ఉల్లాసం**

**సాక్షి, భీమవరం:** ఆటలతో శారీరక ధృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల క్రీడా మైదానంలో భీమవరం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 10 రోజులపాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, విజేతలకు రూ.లక్ష, రన్నర్లకు రూ. 50 వేలు నగబు బహుమతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట బోగయ్య, కోడె యుగంధర్, కమిటీ సభ్యులు చుక్క కిషోర్, చందు, నర్సి, బైరెడ్డి రామకృష్ణ, జాన్, సురేష్, శివరాం, ఆకుల ప్రసాద్, రాజేష్, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.